06-05-2025
మంగళవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 222 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

# పహల్‌గామ్ ఘటన..
## ప్రధానికి తొలిసారిగా పుతిన్ ఫోన్




**జయభేరి, న్యూఢిల్లీ మే 5 :**
హల్‌గామ్ ఉగ్రవాద దాడి ఘటన తర్వాత తొలిసారిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోధీతో ఫోన్‌లో మాట్లాడారు. పహల్‌గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్‌పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. అయితే మోదీకి ఫోన్ చేసిన పుతిన్, ఉగ్ర దాడిని ఖండించారు. మృతులకు తన సంతాపాన్ని తెలియజేశారు. ఉగ్రవాదులను అరికట్టడంలో భారత్‌కు తమ దేశం తరపున పూర్తి మద్దతు ఉంటుందని పుతిన్.. మోదీకి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రన్‌ధీర్ జైశ్వాల్ ఎక్స్ ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్‌రష్యా వార్షిక సదస్సుకు పుతిన్‌ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. మోదీ ఆహ్వానం మేరకు భారత్‌లో పర్యటించేందుకు పుతిన్ అంగీకరించారు.



# రాష్ట్ర భద్రత వారి వారి సంక్షేమం మా బాధ్యత

తెలంగాణలో శాంతి భద్రతలు మెరుగ్గా ఉన్నందునే ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఏ దేశం, రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుంటాయో ఆ ప్రాంతాలు అభివృద్ధి పథంవైపు నడుస్తాయని, తెలంగాణ ప్రశాంతంగా ఉండటానికి పోలీసు శాఖ కారణమని గర్వంగా చెబుతున్నానని అన్నారు.

**జయభేరి, హైదరాబాద్ :**
సరిహద్దుల్లో దేశ భద్రతను సైనికులు ఏ విధంగా కాపాడుతున్నారో, రాష్ట్రంలో అంతర్గత శాంతి భద్రతలను హోంగార్డు నుంచి డీజీపీ వరకు దాదాపు 90 వేల మంది పోలీసు సిబ్బంది 4 కోట్ల తెలంగాణ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతున్నారని ముఖ్యమంత్రి పోలీసు యంత్రాంగాన్ని ప్రశంసించారు. రాష్ట్రంలో వివిధ సందర్భాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వివిధ హోదాల్లో పనిచేస్తున్న 22 రియల్ హీరోస్ (పోలీసు) జీ తెలుగు సంస్థ (Zee Awards 2025) అవార్డుల బహూకరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. "పోలీసులు ఎంత నిబద్ధతతో పనిచేసినా విమర్శలు తప్పడం లేదు. పోలీసు శాఖలోని ఒక ట్రెండు శాతం సిబ్బంది నిర్లక్ష్యం, అవగాహనా లోపం వల్ల సిబ్బందిపైన అనుమానాలు, అవమానాలు తప్పడం లేదు. పోలీసు శాఖ రోజులో 18 గంటలు పనిచేస్తుంది. విధి నిర్వహణలో పోలీసులు పిల్లల చదువుల కోసం సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. పోలీసు పిల్లల భవిష్యత్తు కోసమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించాం. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. శాంతి భద్రతలు కాపాడటంలో తెలంగాణ నంబర్ 1 ర్యాంక్‌లో నిలిచింది. నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలోనూ మొదటి స్థానంలో ఉన్నాం. సైబర్ క్రైమ్‌లో కొల్లగొడుతున్న సొమ్ముని రికవరీ చేయడంలోనూ దేశంలో మనం

...మిగతాది 2 లో

# శబరిమల అయ్యప్ప ఆలయాన్ని సందర్శించనున్న రాష్ట్రపతి



**జయభేరి, న్యూ డిల్లీ మే 5 :**
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పాటు కేరళలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో శబరిమల అయ్యప్ప ఆలయాన్ని కూడా సందర్శించనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి వర్గాలు సోమవారం వెల్లడించాయి.ఈనెల 18, 19 తేదీల్లో రాష్ట్రపతి ముర్ము కేరళలో పర్యటించనున్నారు. 18వ తేదీన రాష్ట్రపతి కొట్టాయం చేరుకుంటారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 19వ తేదీన పంపా బేస్ క్యాంపుకు వెళ్లనున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి శబరిమల అయ్యప్ప ఆలయం వద్దకు చేరుకోనున్నారు. అయితే, అందరి భక్తుల్లా రాష్ట్రపతి కొండపైకి వెళ్తారా.. లేక అత్యవసర అవసరాల కోసం ఉపయోగించే రహదారి ద్వారా ఆలయానికి చేరుకుంటారా అన్నదానిపై స్పష్టత లేదు. దీనిపై స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ నిర్ణయం తీసుకుంటుందని ట్రావెన్‌కోర్ దేవస్వం ప్రెసిడెంట్ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ద్రౌపదీ ముర్ము ఓ రికార్డు నెలకొల్పనున్నారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రెసిడెంట్‌గా ముర్ము నిలవనున్నారు.

# ఇప్పుడు కావాల్సింది సమరం కాదు

- నన్ను కోసినా వచ్చిన ఆదాయానికి మించి ఏమీ చేయలేను
- ఆర్టిసి సమ్మె నేపథ్యంలో ఉగ్యోగ సంఘాల తీరుపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం



**జయభేరి, హైదరాబాద్, మే 5 :**
రాష్ట్రంలోని ఉగ్యోగ సంఘాల తీరుపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టిసి సమ్మె నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. 'ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి.. ఆ సమరం తెలంగాణ ప్రజలపైనా' అని రేవంత్ ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీల కుట్ర అని సిఎం మండిపడ్డారు.
ఈ కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారవద్దని అన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే.. ఉన్న వ్యవస్థ కుప్పకూలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే.. సమాజం సహించదు అని పేర్కొన్నారు. 'మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా? మీ సమరం' అని ప్రశ్నించారు. 'ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘలే సమరం అంటే ఎలా? ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలకు లేదా' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య ఉంటే చర్చించుకుందామని ఉద్యోగ సంఘాలను విజ్ఞప్తి చేశారు.''అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చని, కానీ, అప్పులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం.
ప్రభుత్వం మన కుటుంబ.. కుటుంబ పరువును బజారున పడేయొద్దు. నన్ను కోసినా వచ్చిన ఆదాయానికి మించి ఏమీ చేయలేను. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించవద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణలను అభివృద్ధి పథంలో తీసుకెళ్దాం'' అని రేవంత్ అన్నారు.

# మూడేళ్లలో ముగింపు సాధ్యమేనా..



**జయభేరి, గుంటూరు, మే 5:**
అమరావతి రాజధాని రీలాంచ్ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన పూర్తయిన తర్వాత పాత డిజైన్లతోనే నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు సంబంధించిన డిజైన్లు పూర్తి కావడంతో పాటు వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో ఇక నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీనులైన వేదిక నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మూడేళ్లలో అమరావతి రాజధాని పనులను పూర్తి చేస్తామని చెప్పారు. మోదీ కూడా తన ప్రసంగంలో మూడేళ్లలో పూర్తి అవుతుందని తెలిపారు. దీంతో అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతలన్నీ మున్సిపల్ మంత్రి నారాయణకు చంద్రబాబు నాయుడు అప్పగించారు.అయితే మూడేళ్లలో అమరావతి నిర్మాణపనులు పూర్తి కావడం అంటే ఆషామాషీ కాదు. 365 రోజులు 24 X 7 పనిచేసినా సమయం సరిపోతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పునాదులు తీయడం నుంచి నిర్మాణాలు పూర్తి చేయాలంటే అంత సులువు కాదని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఒక్కొక్క టవర్ నిర్మాణం చేయాలంటే ఎంతో సమయం తీసుకుంటుంది. అందుకు అవసరమైన ముడిసరుకుతో పాటు అనుభవజ్ఞులైన ఇంజినీర్లతో పాటు కార్మికులు కూడా అవసరం. అంతా తీసుకున్నా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పరిస్థితులు రాజధాని నిర్మాణ పనులకు తరచూ అంతరాయం ఏర్పరచే అవకాశముందని అంచనాలు వినపడుతున్నాయి వర్షాలు.. తుపానులు... సముద్ర తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం కావడంతో నిత్యం వర్షాలతో పాటు తుపానులు కూడా ఏడాదిలో ఎక్కువ సార్లు వస్తుంటాయి. జులై నెల వచ్చిందంటే ఇక వర్షాలు మామూలుగా పడవు. ఆగస్టు నుంచి కొంత వర్షాల విషయంలో తెరిపి ఇచ్చినప్పటికీ అక్టోబరు, నవంబరు నెలలో తుపానులు

...మిగతాది 2 లో



# ఇక స్పీడ్ స్పీగ్ గా హైడ్రా చర్యలు

**జయభేరి, హైదరాబాద్, మే 5:**
హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం రేవంత్ రెడ్డి సర్కార్.. హైడ్రాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ప్రభుత్వ భూములు, చెరువులు, పేదల ఇళ్ల స్థలాలు, పార్కులు, రహదారులను ఆక్రమించే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకోనేందుకు సిద్ధమైంది. ఇసుక అక్రమ రవాణా, చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రాష్ట్ర భద్రత వారి బాధ్యత

తొలిస్థానంలో ఉన్నాం. డ్రగ్స్ విషయంలో కూడా ఉక్కుపాదంతో అణిచివేయాలి. అందుకే డ్రగ్స్ నియంత్రించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నాం. నేరం జరిగిన తర్వాత పట్టుకోవడం కంటే నేరం జరక్కుండా నియంత్రించాల్సిన బాధ్యత కూడా పోలీసులపైన ఉన్నది. ఆ దిశగా పోలీసు వ్యవస్థను అధునీకరించుకోవాలి. సాంకేతిక నైపుణ్యాన్ని సాధించుకోవాలి. హోంగార్డు నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ సేవలు అందించేలా ఉండాలి. అందుకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ప్రభుత్వం వెన్ను తడుతుంది. మంచి పనిని అభినందిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే చర్చించుకుందాం. 4 కోట్ల తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర శాంతి భద్రతలను, పెట్టుబడులను అన్నింటినీ కాపాడుకోవలసిన అవసరం ఉంది. మనమంతా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఆర్థిక పరంగా రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులకు స్వీయ నియంత్రణ పరిష్కారం. ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగస్తులు దయచేసి అర్థం చేసుకోవాలి. ఇప్పుడు రాష్ట్రానికి కావలసింది సమయస్ఫూర్తి. తెలంగాణను అభివృద్ధి పథంవైపు నడిపించుకుందాం. ప్రపంచానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలబెట్టుకుందాం" అని ముఖ్యమంత్రి గారు వివరించారు. వివిధ సందర్భాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 22 మంది పోలీసులకు (రియల్ హీరోలు) ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా జీ అవార్డులు 2025 లను బహూకరించారు.

## మూడేళ్లలో ముగింపు సాధ్యమేనా..

పొంచి ఉన్నాయి. సముద్ర తీర ప్రాంతానికి అమరావతి దగ్గరగా ఉండటంతో ఈదురుగాలులతో పాటు భారీ వర్షాలు పడితే పనులకు ఆటంకం ఏర్పడే అవకాశాలున్నాయంటున్నారు. మే నెలలో డిజైన్లు ఖరారయి పనిలో దిగి పునాదులు తవ్వేసరికి జులై వచ్చేస్తుంది. ఇక వర్షాలతో పనులు ముందుకు సాగే అవకాశం లేదు. పోలవరం పనులే పదేళ్ల నుంచి వివిధ ఆటంకాలతో పూర్తి కాకపోవడాన్ని చూసినట్లు ఇంజినీర్లు చెబుతున్నారు. వేసవిలో కూడా అకాల వర్షాలు ముంచెత్తుతున్నాయి. మరో వైపు కృష్ణానదికి వరద ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది. వరద వస్తే మాత్రం అమరావతి ప్రాంతంలో నీరు చేరుతుంది. ఇది కూడా పనులకు ఆటంకంగా మారతాయి. వీటికి తోడు పండగలు, పబ్బాలు ఇలా అన్ని కలుపుకుంటూ పోతే మూడేళ్ల సమయం ఇంత పెద్ద సమయంలో పనులు పూర్తి చేయడం సాధ్యం కాకపోవచ్చన్నది ఇంజినీరింగ్ నిపుణుల అంచనా. ఏదైనా ఒక భవనం అయితే పూర్తి చేయవచ్చు కానీ.. యుద్ధ ప్రాతిపదికపై అన్ని హంగులతో బరిలోకి దిగినా ప్రకృతి ఏ మేరకు రాజధాని నిర్మాణానికి సహకరిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ టెన్షన్ రేపుతుంది. అయితే చంద్రబాబు ఆదేశాల మేరకు టెండర్లు దక్కించుకున్న సంస్థలు వీలయినంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్న లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## ఇక స్పీడ్ స్పీగ్ గా హైడ్రా చర్యలు

క్రిమినల్ కేసులు నమోదు చేసి నేరుగా జైలుకు పంపడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగానే, ఈ నెల 8న బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయం పక్కనే ఒక ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనుంది. ఆక్రమణల కూల్చివేతలో ఇప్పటికే దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా, ఇకపై ఆక్రమణదారులను జైలుకు పంపేందుకు కూడా వెనుకాడబోదని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ స్పష్టం చేశారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్ యొక్క విధివిధానాలను వివరించారు. హైడ్రా ఇప్పటికే వందల ఎకరాల ప్రభుత్వ భూములను, అనేక చెరువులు, పార్కులు, నాలాలను ఆక్రమణదారుల నుంచి కాపాడిందని రంగనాథ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ఆక్రమణలకు సంబంధించిన 50కి పైగా కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో విచారణ దశలో ఉన్నాయని.. హైడ్రా ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో ఈ కేసులన్నీ తక్షణమే హైడ్రాకు బదిలీ అవుతాయన్నారు. అంతేకాకుండా, కొత్తగా నమోదయ్యే ఆక్రమణల కేసులు కూడా ఇకపై వేగంగా పరిష్కరించనున్నట్టు రంగనాథ్ తెలిపారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు వెనుక హైడ్రా రెండు ముఖ్యమైన లక్ష్యాలను నిర్దేశించుకున్నట్టు రంగనాథ్ వివరించారు. మొదటిది, ఆక్రమణ సమస్య యొక్క మూలాల్లోకి వెళ్లి, ముఖ్యంగా చెరువుల ఆక్రమణలను పూర్తిగా నివారించడం. రెండవది, నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్న అధికారులు, సిబ్బంది, ఆక్రమణదారులను పక్కా ఆధారాలతో గుర్తించి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించడం, వారిని జైలుకు పంపడం.ప్రస్తుతానికి ఈ ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వంలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 60 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించనున్నట్టు రంగనాథ్ తెలిపారు. భవిష్యత్తులో ఫిర్యాదుల సంఖ్య పెరిగితే, ఈ పోలీస్ స్టేషన్ల సంఖ్యను కూడా పెంచే అవకాశం ఉందన్నారు. ఆర్థిక నేరాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సైబర్ నేరాల్లో సీసీఎస్ పోలీసులు ఎలా ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తారో, అదే తరహాలో హైడ్రా పోలీసులు కూడా ఆక్రమణదారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తారని తెలిపారు. నేరానికి సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకుని.. నిందితులను చట్ట ప్రకారం శిక్షిస్తారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.చెరువుల ఆక్రమణ అనేది సాధారణంగా నిర్మాణ వ్యర్థాలు డంపింగ్ చేయడంతో ప్రారంభమవుతుందని హైడ్రా కమిషనర్ తెలిపారు. సెల్లార్ తవ్వకాల్లో వచ్చే మట్టి, కూల్చిన భవనాల వ్యర్థాలు, ఇతర చెత్తతో చెరువులను పూడ్చి, వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయించడం ఏళ్లుగా కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు అధికారులు ఫిర్యాదు చేస్తే స్థానిక పోలీసులు కేవలం వాహనాల డ్రైవర్లపై మాత్రమే నామమాత్రపు కేసులు నమోదు చేసేవారని... కానీ, హైడ్రా ఇకపై ఈ సమస్య మూలాల్లోకి వెళ్తుందని పేర్కొన్నారు. హైడ్రా ప్రత్యేక పోలీస్ స్టేషన్ అందుబాటులోకి వస్తే, అక్రమ నిర్మాణ సంస్థలు, చెరువులను పూడ్చే వాహనాల యజమానులు, ప్రధాన ఆక్రమణదారులను వేర్వేరు కఠినమైన చట్టాల కింద అరెస్టు చేసి జైలుకు పంపిస్తారు. ఈ చర్యలతో ప్రభుత్వ భూములు, జలవనరుల ఆక్రమణకు ఇకపై గట్టిగా అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తున్నారు.

## మహిళ కడుపులో కాటర్ ప్యాడ్స్

■ కమాపూర్ ఆసుపత్రిలో దారుణం

**హనుమకొండ :**
ప్రసవమైన మహిళ కడుపులో వైద్యులు నిర్లక్ష్యంతో కాటన్ ప్యాడ్స్ మరిచిపోయారని సదరు బాలింత కుటుంబ సభ్యులు ఆరోపించారు. డాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రాణాపాయస్థితిలో మహిళ వుందని ఆరోపించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఘటన, గత వారం రోజుల క్రితం మండల కేంద్రంలోనీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చిన ఉప్పల్ గ్రామానికి చెందిన తిరుమల అనే మహిళ డెలివరీ సమయంలో వైద్యులు క్లాత్ అందులోనే వుంచి కుట్లు వేయడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. కడుపు నొప్పితో మళ్ళీ ఆసుపత్రికి వచ్చింది. చాలా సేపటివరకు వైద్యులు ఎవరు రాకపోగా హాస్పిటల్ ఆయవైద్యం చేసింది. అందుబాటులో లేని వైద్యులు, ఫోన్ కాల్ ద్వారానే వైద్య తతంగం సిబ్బంది నడిపిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చి మహిళా బంధువులు నిలదీయగా ఘటన వెలుగు చూసింది. డెలివరీ సమయంలో మొబైల్ ఫోన్లు మాట్లాడుతూ పట్టింపు లేకుండా వ్యవహరించారని బంధువుల ఆరోపణ.ఆసుపత్రి సూపరింటెండెంట్ నిర్లక్ష్య ధోరణితోనే వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.మరో ప్రాణం బలి కాకముందే ఆసుపత్రి ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వడగళ్ల వర్షా నికి పంట నష్టం

**మెదక్ జిల్లా:**
మాసాయిపేట మండలం పోతాన్ పల్లి లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి ఎకరా వరి పొలం పంట పంట నష్టం వాటిల్లిందని రైతు తలారి విజయ్ ఆవేదన వ్యక్తంచేశారు. అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నానని పూర్తిగా పంట నష్టం జరుగుతుందని ప్రభుత్వం అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

# వేలకు రానున్న బంగారం

*ఇటీవల కాలంలో ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా తగ్గుతున్నాయి. బంగారం ధరలు భారీగా తగ్గడం లేదా పెరగడం అనేది అంతర్జాతీయ మార్కెట్ల పై ఆధారపడి ఉంటుంది సాధారణంగా స్టాక్ మార్కెట్లు పతనం అయినప్పుడు, బంగారం ధర పెరుగుతుంది. అదే సమయంలో స్టాక్ మార్కెట్ మళ్లీ లాభాల బాట పట్టినప్పుడు బంగారం ధర తగ్గుతుంది ఈ రెండింటికి దగ్గర సంబంధం ఉందిప్రపంచ మార్కెట్లో గత 10 రోజుల్లో బంగారం ఔన్సుకు 300 డాలర్ల వరకు తగ్గింది. అంటే ఔన్సుకు 3500 డాలర్ల నుంచి నుండి 3200 డాలర్లకు పడిపోయింది.*



బంగారం ధర తగ్గడానికి అమెరికా, చైనా ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కార్మిక దినోత్సవం కారణంగా చైనాలో మే 5 వరకు సెలవులు ఉన్నాయి. దీని కారణంగా డిమాండ్ పడిపోయింది. దీంతో పాటు, అమెరికాలో సంతృప్తికరమైన ఉపాధి గణాంకాలు, అమెరికాచైనా సుంకాల యుద్ధంలో సడలింపు సంకేతాలు, త్వరలో కొత్త ఒప్పందం కుదుర్చుకుంటుందనే ఆశల నేపథ్యంలో బంగారం ధరలను తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. అయితే భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి సంకేతాలు కనిపిస్తున్నాయని, అందువల్ల పెద్ద క్షీణతకు అవకాశం లేదని మరికొంత మంది చెబుతున్నారు. బంగారం ధరలు తగ్గడానికి అనేక ప్రధాన కారణాలు ఉన్నాయి. ప్రపంచ వాణిజ్య చర్చలపై మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడటంతో ఈ వారం బంగారం ధరలు తగ్గాయి. భారతదేశం, జపాన్, దక్షిణ కొరియా, చైనాలతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లేవనెత్తారు. చైనాకు సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు అమెరికా సుంకాలపై చర్చలను తిరిగి ప్రారంభించిందని పేర్కొన్నాయి. ఇది కాకుండా చైనాలో సెలవుల వల్ల కూడా బంగారం ధరలు తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. చైనాలో కార్మిక దినోత్సవ సెలవుల కారణంగా మే 1 నుంచి 5 వరకు మార్కెట్ మూసిశారు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం వినియోగించే దేశం చైనా కాబట్టి ఈ కాలంలో డిమాండ్ తగ్గింది. అమెరికాలో ఉపాధి నివేదిక కూడా బంగారం ధరలపై ప్రభావం చూపింది. ఏప్రిల్‌లో అమెరికాలో 1.77 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించారని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ వారం బంగారం క్షీణత వార్తల్లో నిలిచినప్పటికీ బంగారానికి దీర్ఘకాలిక మద్దతు బాగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దానిని బలపరిచే అనేక అంశాలు ఉన్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నేపథ్యంలో బంగారం ధరలు ఇంక తగ్గవని కొంత మంది నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారంలో పెట్టేందుకు ఎక్కువగా ఇష్టపడతారు.

గతేడాది ఏప్రిల్ నెలలో 10గ్రాముల 24క్యారట్ల గోల్డ్ రేటు రూ.75వేలుగా ఉంది. అప్పటి నుంచి దాదాపు 25శాతం వరకు గోల్డ్ రేటు పెరిగింది. 2025 ప్రారంభంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు చేపట్టగానే చైనా సహా ప్రపంచ దేశాలు అన్నింటిపైన సుంకాలు పెంచేశారు. వాణిజ్య యుద్ధం కారణంగా బంగారం ధరలు రికార్డు స్థాయిలను నమోదు చేశాయి. ప్రస్తుతం గోల్డ్ రేటు క్రమంగా తగ్గుతుంది.ఏంజెల్ వన్‌లో కమోడిటీస్, కరెన్సీల చీఫ్ టెక్నికల్ రీసెర్చ్ అనలిస్ట్ తేజస్ అనిల్ షిగ్రేకర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దక్షిణ కొరియా, జపాన్, భారతదేశంతో సంభావ్య వాణిజ్య ఒప్పందాల గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచనలతోపాటు.. చైనా, అమెరికా మధ్య ట్రేడ్ వార్ ఉధృతి కూడా కాస్త తగ్గుముఖం పట్టింది. దీంతో బంగారం ధరలు తగ్గుదలకు కారణం అవుతున్నాయని తెలిపారు.నిర్మల్ బ్యాంగ్ కమోడిటీస్ రీసెర్చ్ హెడ్ కునాల్ షా మాట్లాడుతూ.. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల్లో అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సు కు 3,000 డాలర్ల లేదా 2,950 డాలర్లకు చేరుకుంటుంది. భారత్ లో 10గ్రాముల 24క్యారట్ల గోల్డ్ రేటు రూ. 88,000 దిగువకు పడిపోతుందని ఆయన అంచనా వేశారు. ఇదే అభిప్రాయాన్ని ఏంజెల్ వన్ కు చెందిన అనిల్ షిగ్రేకర్ వ్యక్తం చేశారు. వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం వల్ల బంగారంపై ఇన్వెస్టర్ల పెట్టుబడి తగ్గుతుందని, తద్వారా రాబోయే కొద్దికాలంలో గోల్డ్ రేటు మరింత తగ్గుతుందని అంచనా వేశారు.బంగారాన్ని సేఫ్ ఇన్వెస్ట్మెంట్ అని పిలుస్తారు. ఇందులో పెట్టుబడి పెట్టడం ద్వారా బంగారానికి డిమాండ్ ఏర్పడి ధరలు భారీగా పెరుగుతాయి. అయితే మళ్లీ స్టాక్ మార్కెట్లో లాభాల బాట పట్టిందంటే ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను బంగారం నుంచి తొలగించి స్టాక్ మార్కెట్లో పెడతారు.

**రాబోయే మూడు నుంచి నాలుగు నెలల్లో అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్సు కు 3,000 డాలర్ల లేదా 2,950 డాలర్లకు చేరుకుంటుంది. భారత్ లో 10గ్రాముల 24క్యారట్ల గోల్డ్ రేటు రూ. 88,000 దిగువకు పడిపోతుందని ఆయన అంచనా వేశారు. ఇదే అభిప్రాయాన్ని ఏంజెల్ వన్ కు చెందిన అనిల్ షిగ్రేకర్ వ్యక్తం చేశారు.**

# ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం ఫోకస్

## పనితీరు బాగోలేకపోతే వాత పెట్టుడే...

**తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరం మీద ఆరు నెలలు అధికారం గడిచిపోతున్న సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల పనితీరుపై ఫోకస్ పెట్టారు. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో ఆయా నియోజకవర్గాలలో సొంత పార్టీలో మీ ఎమ్మెల్యేల పనితీరు వారి పాలన విధానం, అలాగే పార్టీ నుండి కావలసిన అవసరాలు ఏంటి అనే విషయాలపై ఆరా తీసే విధంగా పనులు చకచగా నడుస్తున్నాయి.**



ఇక ఇదే వరుసలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజల్లోకి వెళుతున్నాయి లేవా అసలు ఎలాంటి ప్రచారం చేశారన్న విషయాలపై ఆరా తీస్తున్నారు... గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు కావలసినంత నిధులు సమకూర్చి అధికారంలోకి తెచ్చుకున్న కెసిఆర్ ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు బాగానే ఆస్తులు సంపాదించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అప్పుల్లోకి నెట్టేశారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక నేరగాళ్లు ఉగ్రవాదం అనే పదాలు వాడారు సీఎం రేవంత్ రెడ్డి. తెలంగాణకు చెందిన అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పనితీరును తెలుసుకునేందుకు ఒక్కొక్కరితో విడివిడిగా మాట్లాడుతూ నియోజకవర్గం సమీకరణాలు చేయాలన్నట్టుగా సంకేతాలు ఇప్పటికే ఆయా ఎమ్మెల్యేలకు వెళ్లాయి..ప్రభుత్వం తరఫున ఇంతకాలం ఎన్ని సంక్షేమ పథకాలు అందించాము ఎన్ని గ్రామాల్లో సభలు సమావేశాలు నిర్వహించారు పథకాల ప్రచారం ఏ విధంగా సాగింది అన్న అన్ని విషయాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆరో తీసే అవకాశాలు కల్పిస్తున్నాయి... అలాగే నియోజకవర్గాల్లో పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలతో ఎన్నిసార్లు ముఖాముఖి సభలు ఏర్పాటు చేశారు అనే వివరాలు కూడా తీసుకుంటున్నారు.. రానున్న మూడు సంవత్సరాల్లో నియోజకవర్గంలో ఏ అవసరాలు ఉన్నాయి ప్రజలకు సంక్షేమ పథకాలు అన్ని అందుతున్నాయా లేదా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఇక ఈ విషయం జూన్ రెండు లోపు అన్ని నియోజకవర్గాల్లో ఒక్కొక్క ఎమ్మెల్యేలతో విడివిడిగా సీఎం కూర్చొని మాట్లాడే విధంగా ప్లాన్ కూడా చేసుకున్నారు.. ఇక గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ హయంలో ఉన్నప్పుడు ఒక్కొక్క ఎమ్మెల్యే ఎంత ప్రకృతి నిధులు వెనకేసుకున్నారు మనందరికీ తెలిసిందే. ఇసుక దగ్గర నుంచి రోడ్డు వరకు చెట్టు నుంచి పుట్టమట్టి వరకు చెరువు దగ్గర నుంచి కుంట దగ్గర వరకు ఇలా ఏది వదిలిపెట్టకుండా గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సహజ వనరులను అన్నింటిని కొల్లగొట్టారు. ఏ ఒక్క రోజు కూడా సీఎంగా కెసిఆర్ ఆయా ఎమ్మెల్యేలకు పనితీరును మందలిచినట్టుగా మనం చూడలేదు... అంతేకాకుండా ప్రతి పని ప్రగతి భవన్ కు వెళ్లే విధంగా ఎమ్మెల్యేలకు అధికారాన్ని ఏం లేకుండా కూడా చేశాడు. దీంతో కెసిఆర్ పంచన చేరిన ఆనాటి ఎమ్మెల్యే లందరూ దొరికిన కాడికి దండుకొని బాగానే ఫామ్ హౌజులు ఆస్తులు అంతస్తులు కార్లు బంగాళాలు బాగానే కట్టుకున్నారు. ఏ ఒక్క రోజు కూడా ఎమ్మెల్యేలు ప్రజల్ని మందరించిన పాపాన పోలేదు. ఇకపోతే ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు కూడా కేవలం ఆ పార్టీ కార్యకర్తలకే అందే విధంగా పక్కా ప్రణాళిక వేసుకొని ఎంతోమంది కడుపుని కొట్టిన పరిస్థితులు మనం చూశాం. అలాగే



✍ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్ (జయభేరి),
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఎడిటోరియల్
జర్నలిస్ట్ అవార్డు గ్రహీత, కవి, గాయకుడు,
రచయిత, సామాజిక ఉద్యమకారులు

నిధుల దుర్వినియోగం ఎమ్మెల్యేల పనితీరు బాగోలేకనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడగొట్టి అధికారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారాన్ని కట్టబెట్టారు.. రెండు ముఖ్యమంత్రుల పనితీరును చూస్తే గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రి పని తీరు పూర్తిగా అర్థమైనప్పటికీ ఇప్పుడు సీఎం గారు రేవంత్ రెడ్డి తనదైన మార్కును చూపించుకునేలా ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజలకు చేరాయా లేదా అన్న విషయాలను ఆయా ఎమ్మెల్యేలతో ఒక్కొక్కరిగా పర్సనల్గా మీటింగ్ కు ప్లాన్ చేసుకుంటున్నారు... రాబోయే మూడు సంవత్సరాలలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి కుంటు పడకుండా నియోజకవర్గంలోని పెండింగ్ పనులు అన్నిటిని పూర్తి చేయడానికి కొత్త పనులను ప్రారంభించి స్థానిక ఎన్నికల్లో మళ్లీ తిరిగి విజయం సాధించడానికి పక్క ప్రణాళికలు సీఎం రేవంత్ రెడ్డి రచిస్తున్నారు.

గత ముఖ్యమంత్రికి ప్రస్తుతం ముఖ్యమంత్రి కి వ్యత్యాసం పరిపాలన విధానంలో స్పష్టంగా కనిపిస్తున్న ఎమ్మెల్యేల పనితీరు సరిగ్గా లేకపోతే ప్రభుత్వంపై మచ్చ పడే ప్రభావం ఉందని ఇప్పటికే రేవంత రెడ్డి కి అర్థం అయినట్టుగా కనిపిస్తోంది. సొంత పార్టీ ఎమ్మెల్యేదైనా సరే కచ్చితంగా ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తూ తమ నియోజకవర్గంలో కార్యకర్తలను పోగు చేస్తూ వారితో సభలు సమావేశాలు నిర్వహించాలని ప్రతి ఒక్కటి పేపర్ మీద రాసి నాకు చూపించాలని ఆదేశాలు జారీ చేసిన రేవంత్ రెడ్డి తనదైన మార్కుతో తెలంగాణ ప్రభుత్వాన్ని పరిపాలిస్తున్న ఇంకోవైపు ప్రతినెల అప్పుల భారంతో కూడుకుపోతున్న తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా గట్టెక్కిస్తారనేది కాలమే నిర్ణయించాలి..

# శ్రీ ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

- అంగరంగ వైభవంగా ఆంజనేయ స్వామికి పూజలు
- ఉపవాస దీక్షలతో కన్నుల పండుగగా తొమ్మిది రోజుల వేడుకలు
- నియమ, నిష్టలతో, భక్తి భావంతో భక్తుల కోలాహలం
- గొల్లగూడెం నసర్లబాయితండా ఆంజనేయ స్వామికి భక్తుల నీరాజనం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని గొల్లగూడెం, నసర్లబాయి తండా వద్ద గల పురాతన దేవాలయమైన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. ఆలయ పెద్దలు, నేనావత్ సేవ్య నాయక్, అర్చకులు గంటసాల సుబ్రహ్మణ్య శర్మ, పురోహితులు, ఆలయ నిర్వాహకులు, స్థానికుల



ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు భక్తులు ఉపవాస దీక్షలతో, నియమనిష్ఠలతో, భక్తి భావంతో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మొదటగా గణపతి పూజ, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి సంబంధించిన పూజా కైంకర్యాలను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య చేపట్టారు. క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించగా భక్తులు నవధాన్యాలు, పసుపు కుంకుమలు కొబ్బరికాయలతో విశేష పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంతో పురాతనమైన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలతో పాటు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని నిర్వాహకులు నేనావత్ సేవ్యా నాయక్ తెలిపారు. ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి, పూజా కార్యక్రమానికి సహకరించిన స్థానికులకు, నిర్వాహకులకు, భక్తులకు, ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేనావత్ సేవ్యానాయక్, నేనావత్ బాల్య నాయక్, ఇస్లావత్ లక్ష్మ, ఇస్లావత్ శంకర్, ఆంగోత్ రవి, నేనావత్ రమేష్, సభావత్ బాలాజీ, బత్తుల సాలయ్య, బత్తుల తిరుపతయ్య, నల్లగాసు లక్ష్మయ్య, బత్తుల ఆంజనేయులు, బత్తుల చిన్న అంజియాదవ్, నల్లగాసు అంజయ్య, నల్లగాసు రాజు, నోముల ఆంజనేయులు, రాంబాబు, రమేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

---

# బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంలో మాజీ మంత్రి.. మాజీ ఎమ్మెల్యే

**జయభేరి, చందంపేట :**



చందంపేట మండలం మూడుదండ్ల గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ,శ్రీముత్యాలమ్మ, ఇదమ్మ విగ్రహ ప్రతిష్ఠ,ఆంజనేయ స్వామి ధ్వజ స్థంభం ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. దైవ చింతనతో



మానసిక ప్రశాంతత లభిస్తుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలుగురు వల్లపు రెడ్డి, రమావత్ దస్రు నాయక్, రాజినేని వెంకటేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్,యాసాని రాజవర్ధన్ రెడ్డి, ముక్కామల్ల బాలయ్య, మాధవరం జనార్ధన్ రావు,అరేకంటి రాములు, కేతావత్ శంకర్ నాయక్, రమావత్ మోహన్ కృష్ణ, పల్సవెంకటయ్య, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులసిరామ్ నాయక్, వడిత్య బాలు, గోసుల శివ, శ్రీను, శ్రీశైలం, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

---

# వనజీవి రామయ్య ఆశయాన్ని కొనసాగిద్దాం




**జయభేరి, కొండమల్లేపల్లి :**

డాక్టర్ పద్మశ్రీ దారిపెల్లి రామయ్య( వనజీవి రామయ్య) ఆశయాలు కొనసాగిద్దామని డాక్టర్ వీరభోగ వసంత రాయలు, కుమ్మర శాలివాహన సంఘం కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు, కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరుకొండ రాము అన్నారు. వాస్విక్ ఫౌండేషన్ తెలంగాణ చైర్మన్ నిడిగొండ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో వనజీవి రామయ్య కృతజ్ఞత (సంస్మరణ)సభను హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ప్రసాద్ లాబ్స్ లో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ వనజీవి రామయ్య తన 50 సంవత్సరాల జీవితాన్ని మొక్కలు నాటడం కోసమే త్యాగం చేశాడని సూచించారు. కోటిన్నర మొక్కలు నాటిన అపర భగీరథుడని కొనియాడారు .తన కున్న మూడు ఎకరాల భూమిని కూడా అమ్మి మొక్కలు నాటడానికే ఉపయోగించాడు అంటే ఆయనకు ప్రకృతిపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఆయన సేవలు గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుని ఇవ్వడం ఆయనకు గౌరవ ప్రదమని అన్నారు.

ఆయనకు ఉన్న మొక్కలు నాటే ఆశయాన్ని మేము కూడా కొనసాగిస్తామని వారన్నారు .వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా సూచించారు. మానవ మనుగడకు ప్రకృతి పచ్చదనం ఎంతో అవసరమని అన్నారు.

ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి కాపాడాలని ఈ సందర్భంగా సూచించారు .వనజీవి రామయ్య భౌతికంగా లేకపోయినా ఆయన మొక్కల రూపంలో మన మధ్యనే ఉన్నాడని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వనజీవి రామయ్య కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.

---



# ఇంటర్ ప్రవేశాలకు వేళాయె

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని పెంచికల్పహాడ్లో (బాలురు &బాలికల ) మోడల్ స్కూల్ మరియు జూనియర్ కాలేజ్ 202526 విద్య సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎం ఆశీర్వాదం సోమవారం ప్రకటన విడుదల చేశారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఆన్లైన్లో సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తమ కళాశాలలో ఎంపీసీ 40 ఎంఈసి 40 బైపీసీ 40 సీఈసీ 40 సీట్లు ఉన్నాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని, కళాశాలలో అన్ని సదుపాయాలతో పాటు బాలికలకు హాస్టల్ వసతి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని కళాశాల కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

---

# చెట్టు పడి మహిళ దుర్మరణం

**జయభేరి, విశాఖపట్టణం, మే 5 :**

జీవితం చాలా చిన్నది. ఎంత చిన్నది అంటే తర్వాత క్షణంలో బతికి ఉంటామో లేమో చెప్పలేనంత. కళ్ల ముందు అలాంటివి నిజం అనిపించే దృశ్యాలు ఎన్నో కనిపిస్తూ వస్తున్నాయి. తాజాగా విశాఖలో ఘటన ఇలాంటిదే జరిగింది. విశాఖలోని సీతమ్మధార ప్రాంతం ఎప్పుడూ బిజీగా ఉంటుంది. గంటకు కొన్ని వందలు, వేల వాహనాలు ఆ రోడ్డు మీదుగా వెళ్తూంటాయి. అలా ఆ దారిలో పూర్ణమ అనే మహిళ కూడా.. ఆ దారి గుండా వెళ్తోంది. అక్కడ ఓ చెట్ట కింద నుంచి ఆమె వెళ్తున్నారు. చెట్టు పూర్తిగా దాటలేదు..కానీ ప్రాణాలు కోల్పోయారు. ఖచ్చితంగా పూర్ణిమ ఆ చెట్టు కిందకు వచ్చిన వెంటనే ఆ చెట్టుకూలిపోయింది. కచ్చితంగా పూర్ణిమపై పడింది. పూర్ణిమ తప్పించుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. నేరుగా వచ్చి మీద పడటంతో ఏం జరిగిందో తెలియక ముందే..క్షణాల్లో ఆమె కన్ను మూశారు. చెట్టు కొమ్మను ఆమె పై నుంచి తీసేసి.. ఆస్పత్రికి తరలించారు కానీ... అప్పటికే చనిపోయినట్లుగా వైద్యులు తేల్చారు. ఈ ఘటనలో చెట్టు కింద ఉన్న రాక్టర్, కారు కూడా ధ్వంసం అయ్యాయి. పూర్ణిమ ఆ దారి గుండా కొన్ని వందల సార్లు ప్రయాణించి ఉంటారు. గతంలో ఎండకు.. నీడకు ఆ చెట్టు కింద సేదదీరి ఉంటారు. కానీ..ఇప్పుడు మాత్రం ఆ చెట్టు కొమ్మలే ఆమె ప్రాణం పోవడానికి కారణం అయ్యారు. ఈ చెట్టు ఆమెపై పడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

---



# పదవ తరగతి విద్యార్థులకు సన్మానం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ పదవ తరగతి ఫలితాలలో 550 కి పైగా మార్కులు సాధించిన ఎన్ వరుణ్ 565, కీర్తి శ్రీ 564, తహియా ముబాశిర 562, స్ఫూర్తి 562, యుతికా రెడ్డి 562, సాహితి 556, గోవింద్ 555, ఆది శ్వేత పాటిల్ 555 విద్యార్థులకు పాఠశాల సీఈవో శ్రీనివాస్ రెడ్డి సోమవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రఘువీరా చారి, రాజ్ కుమార్ రెడ్డి,పాఠశాల డైరెక్టర్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ మహమ్మద్ అన్వర్ హుస్సేన్,ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

---

# బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న జాలే బ్రదర్స్




**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని మూడుదండ్ల గ్రామంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి, ఈదమ్మ తల్లి, ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ సహిత గ్రామ బొడ్రాయి (నాభిశీల)విగ్రహా ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన నాయకులు జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు PACS చైర్మన్ జాలే నరసింహారెడ్డి మాట్లాడుతూ దేవరకొండ ప్రాంత ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాలే తిలక్ రెడ్డి,మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప తిరుపతి రెడ్డి కోరుట్ల వెంకన్న, తిరుపతయ్య, వేంకులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

---

# నూతన ఎమ్మార్వో మధుసూదన రెడ్డి కి ఘన సన్మానం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలానికి నూతనంగా విచ్చేసిన మధుసూదన్ రెడ్డి (తహసిల్దార్) ని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ఎమ్మార్వో కి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మా మండలానికి మీరు రావడం చాలా సంతోషకరమని ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల శ్రీను ఆర్మీ, మద్దెల విక్టర్, మద్దెల శాంసన్, అంకం చంద్రమౌళి, లింగంపల్లి మధు, కడారి బలరాములు, చేరిపల్లి జయలక్ష్మి, కానుగుల మోహన్, కొండపల్లి శీను, లౌడ్య భాషా నాయక్, బాబా, మాకం చంద్రమౌళి (సీఎం),శాంసన్, E నరేష్, వడ్త్యా గోపి నాయక్, గందూరి లక్ష్మణ్, కడారి కొండల్, అబ్దుల్ కలాం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

---

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 1989-1991 ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు



**జయభేరి, గజ్వేల్, మే 04 :**

గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1989,91 ఇంటర్మీడియట్ బ్యాచ్ సుదీర్ఘంగా 35 సంవత్సరాల తర్వాత సోషల్ మీడియా వాట్సప్ గ్రూప్ ద్వారా అందరినీ ఏకం చేసి ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం గజ్వేల్ లోని ఓ ప్రైవేట్ బాంకిట్ హాల్ లో ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా నాటి విద్యార్థిని విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఉదయం నుండి సాయంత్రం వరకు ఉత్సవంగా గడిపారు. ఒకే వేదికపై గురువులతో కలిసి తమ జ్ఞాపకాలను పంచుకున్నారు.కళాశాలలో బోధించిన గురువులను ఘనంగా శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురువులు రాంచందర్, జి, నాగేశ్వరరావు,ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

---

# ఉజ్జయినిలోని మహాకాళేశ్వర ఆలయంలో భారీ అగ్నిప్రమాదం

**జయభేరి, ఉజ్జయి, మే 5 :**

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మహాకాళేశ్వర ఆలయ సముదాయంలోని శంభ్ ద్వార్ సమీపంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపుచేసేందుకు చర్యలు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమికంగా తేల్చారు. అయితే, అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కమ్ముకుంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



## ఎంపీ రఘునందన్ రావు కలిసిన బిజెపి నాయకులు

**జయభేరి, మార్కూక్, మే 04 :**

మండలం పరిధిలోని వరదరాజపురం గ్రామంలోనీ శ్రీ భూనీల సమేత వరదరాజ స్వామి వారి దేవస్థానం పున: ప్రతిష్ట మరియు బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభ పత్రిక ను మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మర్కుక్ మండల బిజెపి అధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి బిజెపి సీనియర్ నాయకులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, జిల్లా నాయకులు రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శులు కుంట సత్యం, పాలే మహేందర్ మరియు మైసీగారి బాలకృష్ణ ,వరదరాజపూర్ గ్రామ బీజేపి నాయకులూ అంతానీ సురేష్, వల్లపు సత్యం ,అంతాని గణేష్, మీసాల జాను కలిసి అందించడం జరిగింది.


## రామాలయం నిర్మాణానికి సహకరించండి



**జయభేరి, పరవాడ :**

రావాడ పంచాయతీ శివారు మోటూరువానిపాలెం గ్రామంలో రామాలయం నిర్మాణంలో స్థానిక యువత భాగస్వాములయ్యారు. స్థానిక జనసేన నాయకుడు మోటూరు హరి ఆధ్వర్యంలో గ్రామంలోని యువత రామాలయం నిర్మాణం నిమిత్తం పరిసర గ్రామాల్లో తిరిగి లక్ష రూపాయలు విరాళాలు సేకరించి ఆలయ కమిటీ వారికి అందజేసారు.ఆలయ కమిటీ సభ్యులు యువతకు ప్రత్యేక ధన్య వాదాలు తెలియజేసారు.కాగా రామాలయం నిర్మాణం కొరకు పూర్తి సహకార మందిస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఇది వరకే హామీ ఇచ్చారని జనసేన నాయకుడు హరి తెలిపారు.ఎమ్మెల్యే నిధులు గాని ఎంపి నిధులు గాని మంజూరయ్యేలా చేసి రామాలయ నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా ఎమ్మెల్యే పంచకర్ల ప్రత్యేక చొరవ చూపాలని గ్రామస్తుల తరపున హరి కోరారు.అలాగే పంచాయతీ పరిధిలో నాయకులు,పెద్దలు,ప్రముఖులు కూడా రామాలయ నిర్మాణానికి ఆర్థిక చేయూత నివ్వాలని మీడియా ముఖంగా హరి కోరారు.

## ఈ సెట్. ఐసెట్ లకు అంతా సిద్ధం



**జయభేరి, విజయవాడ, మే 5:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షలు మే 6) నుంచి ప్రారంభమవనున్నాయి. మే 6 నుంచి జూన్ 13 వరకు దాదాపు ఎనిమిది ప్రవేశ పరీక్షలను ఉన్నత విద్యా మండలి వరుసగా నిర్వహించనుంది. ఈ మేరకు తాజాగా షెడ్యూల్ కూడా విడుదల చేసింది. మే 6న ఈసెట్, 7న ఐసెట్ పరీక్షల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. పరీక్ష కేంద్రాల వద్దకు నిర్ణీత సమయానికంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది.ఇప్పటికే పరీక్షల తేదీల వారీగా హాల్‌టికెట్లను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ తో పాటు వ్యక్తిగత గుర్తింపు కార్డు, బ్లాక్ లేదా బ్లూ బాల్‌పాయింట్ పెన్నును మాత్రమే పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లాలని సూచించింది. ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించబోమని స్పష్టం చేసింది. హాల్‌టికెట్‌పై ముద్రించిన వివరాలపై అభ్యంతరం ఉంటే పరీక్షా కేంద్రంలోని అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, విద్యార్థులందరూ తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలని సూచించింది. ఈ మేరకు ఏపీ ఈసెట్‌ను మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి దుర్గాప్రసాద్ తాజాగా ఓ ప్రకటనలో వెల్లడించారు.ఈసెట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా లేటరల్ ఎంట్రీ కింద డిప్లొమా పూర్తి చేసిన వారికి ఇంజినీరింగ్ సెకండియర్‌లో నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈసెట్ పరీక్ష మే 6వ తేదీన మొత్తం రెండు షిఫ్టుల లో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరగనుంది. మొదటి షిఫ్టు ఉదయం సెషన్ 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. ఇక మధ్యాహ్నం సెషన్ 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సెకండ్ షిఫ్ట్‌లో జరుగుతుంది.

## సర్వీసు రోడ్డులో అక్రమ నిర్మాణాలు.. బీజేపీ ధర్నా

**జయభేరి, చౌటుప్పల్:**

యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్ లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు గురై వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, అట్టి అక్రమ కట్టడం దర్గా పై చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి వినతిపత్రం అందజేసిన . ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,దూడల భిక్షం, బిజెపి నాయకులు పాల్గొన్నారు. గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై గ్రీన్ ఫీల్డ్ హైవేలు మరియు ఎక్స్ ప్రెస్ రహదారులు నిర్మించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుంది కానీ విజయవాడ టు హైదరాబాదుకు వెళ్లే జాతీయ రహదారి 65 పై సర్వీస్ రోడ్లో అడ్డంగా ప్రార్థనా మందిరాలు నిర్వహిస్తున్న కానీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి నిమ్మకు నీరు ఎత్తకుండా వ్యవహరిస్తున్నారు వీరి వ్యవహార శైలి చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని సుమారు 114 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించిన తర్వాత అనుమతులు వచ్చిన తర్వాత దాని అలైన్మెంట్ ఈ దర్గా కోసం అలైన్మెంట్ మార్చారు మొదట ఎలాగైతే అనుమతులు ఇచ్చారో దాని ప్రకారమే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ఒక వర్గం కోసం ఎదురు చూడకుండా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా రహదారులు నిర్మించాలని కోరారు.

# 1000 ఎకరాల్లో ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ సిటీ

**జయభేరి, హైదరాబాద్, మే 5:**



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా "ఫ్యూచర్ సిటీ"ని ఏర్పాటు చేస్తోంది. దీని అభివృద్ధి చర్యలలో భాగంగా ఏకంగా 1000 ఎకరాల్లో ప్రత్యేకంగా ఎలక్ట్రానిక్ సిటీ (ECity)ని అభివృద్ధి చేయనున్నట్లు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ సిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఫార్మా సిటీతో పాటు స్కిల్ యూనివర్సిటీ సైతం రాష్ట్ర ప్రభుత్వం డెవలప్ చేస్తోంది. తెలంగాణలో రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు సయుక్తంగా ముందుకొచ్చిన టెలికాం ఉత్పత్తుల సంస్థలు సిరా నెట్ వర్క్స్ (త్రైవాన్), ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ (తెలంగాణ) ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర సచివాలయంలో ఇటీవల సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను శ్రీధర్ బాబు వారికి వివరించారు. ఎలక్ట్రానిక్ తరహా పరిశ్రమలు ఏర్పాటులో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోని టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని శ్రీధర్ బాబు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక వేత్తల అవసరాలకు అనుగుణంగా వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చిన సిరా నెట్ వర్క్స్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ ప్రతినిధులకు మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రోత్సహకాలతో పాటు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.సుమారు 10 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమ ద్వారా 2500 మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఇక్కడ మల్టీ లేయర్ నెట్వర్కింగ్ సొల్యూషన్స్, 5జీ నెట్ వర్క్స్, సర్వర్స్ తదితర టెలికాం ఉత్పత్తులను తయారు చేస్తారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ పెట్టుబడితో ఇండియా, తైవాన్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు సంస్థల ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్న సమావేశంలో టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్, టీజీఐసీసీ సీఈవో మధుసూదన్, సిరా నెట్వర్క్స్ ప్రతినిధులు చుయాన్, జాయ్ భట్టాచార్య, డౌగియాస్, ఎల్ సీజీసీ రెజల్యూట్ గ్రూప్ ప్రతినిధులు రణ్వీందర్ సింగ్, గీతాంజలి సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ వర్కర్ పై రాజకీయ ఆధిపత్య వేధింపులు

- వేధింపులకు పాల్పడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలి
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్.

**పరవాడ:**




మండలంలో రావాడ సర్పంచ్ రాజకీయదింపులకు అంగన్వాడీలను బలి చేస్తున్నాడని రెండో తేదీన జరిగిన కిషోర్ వికాసం కార్యక్రమంలో ఏ విధమైన సంబంధం లేకపోయినా అంగన్వాడి పై రాజకీయ వేధింపులకు పాల్పడి వారి రాజకీయ ఆధిపత్యం కోసం అంగన్వాడి కార్యకర్తకి ఐసిడిఎస్ సి డి పి ఓ ద్వారా మెమో జారీ చేయించి సర్పంచ్ కి సిడిపిఓ పంపించడం దాన్ని గ్రూపుల్లో పెట్టి మానసికంగా అంగన్వాడీని వేధిస్తున్న రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు పైన, సిడిపిఓ పైన విచారణ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని గని శెట్టి డిమాండ్ చేస్తారు. సోమవారం పరవాడ ఎంపీడీవో కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎంపీడీవో కి వినతి పత్రం అందజేశారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఏ విధమైన విచారణ లేకుండా మెమో జారీ చేయడం ఆమెమో కూడా అంగన్వాడి వర్కర్ కి ఇవ్వకుండా సర్పంచ్ కి అందజేసి రాజకీయ వేదింపులకు కారణమైన సిడిపిఓ పై శాఖాపరమైన విచారణ చేసి సిడిపిఓ ను సస్పెండ్ చేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, ఎం. అమ్మాజీ , రత్నం, వెంకటలక్ష్మి, పార్వతి, రాణి తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మ తల్లి పండగక్కి సర్వం సిద్ధం


**జయభేరి, పరవాడ :**

మండల కేంద్రం పరవాడలో కొలువై ఉన్న భక్తులపాలిట కొంగు బంగారం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, మహిమాన్విత శక్తి స్వరూపిని ముత్యాలమ్మతల్లి (బ్రాహ్మణి) అమ్మ వారి జాతర మహోత్సవాన్ని 8వ తేది గురువారం నాడు అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నామన్నారు. భక్తులు క్యూ లైన్ లో అమ్మవారిని దర్శించుకునేలా బారికేడ్లు,టెంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దర్శనానికి విచ్చేసిన భక్తులకు ముత్యాలమ్మతల్లి యూత్ సభ్యులు ఆధ్వర్యంలో ప్రసాదం, మజ్జిగ, లడ్డు, చలువ పుచ్చకాయలు వితరణ ఉంటుందన్నారు. మధ్యహ్నం 12 గంటల నుండి ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలు, బాణాసంచా కాల్పులతో అమ్మవారి అనుపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. జాతరలో రాత్రికి డ్యాన్స్ మస్తీ కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. స్థానిక నాయకులు, పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఎర్రబంధ యూత్ సభ్యులు, మహిళలు, ప్రజలు ముత్యాలమ్మతల్లి జాతర మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిదులు కోరారు.

# మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉద్యోగాలు ఇప్పించండి

- ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్రకి వినతిపత్రం అందజేసిన మత్స్యకార నేత చింతకాయల ముత్యాలు

**జయభేరి, పరవాడ:**



అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం, జి ఎస్ కన్వెన్షన్ హాల్ లో జరిగిన తెలుగుదేశంపార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి గనుల ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకి ముత్యాలమ్మపాలెం మత్స్యకారులు పోరాటం చేసి సాధించుకున్న ఫార్మాసిటీలో 500 ఉద్యోగాలు ఇవ్వకుండా, రాంకీ యాజమాన్యం, ఫార్మాసిటీ యాజమాన్యంలు మోసం చేసినందున గతంలో కుదిరిన ఒప్పందం మేరకు మరియు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు మేరకు ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు రావలసిన 500 ఉద్యోగాలు ఇప్పించి మత్స్యకారులని ఆదుకోవాలని రాష్ట్ర మత్స్యకార సంక్షేమ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు మంత్రి కొల్లు రవీంద్ర వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, ఎంపిటిసిలు అర్జిల్లి దేవిరవి, మైలపల్లి అప్పన్న, మాజీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, చింతకాయల అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## జూబ్లీహిల్స్ లో "బూమ్ బూమ్"

- థాయిలాండ్ యువతితో పాటు బంగ్లాదేశ్ యువతి చేత వ్యభిచారం..
- సర్వీస్ అపార్ట్ మెంట్ కేంద్రంగా సెక్స్ రాకెట్.

**జయభేరి, హైదరాబాద్:**

జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 9లో సర్వీస్ అపార్ట్మెంట్ లో వ్యభిరారం చేస్తూ ఇద్దరు విదేశీ యువతులు పట్టుబడ్డారు. థాయిలాండ్ యువతితో పాటు బంగ్లాదేశ్ యువతి పోలీసులకు దొరికిపోయింది. సర్వీస్ అపార్ట్ మెంట్ కేంద్రంగా సెక్స్ రాకెట్ నడుస్తోంది. బంగ్లా యువతి (23).గత డిసెంబర్ లో అక్రమంగా సరిహద్దు దాటి వచింది. థాయ్ లాండ్ యువతి (30) డిసెంబర్ లో ట్రావెల్ వీసాతో స్నేహితుడి కోసం వచ్చి చెన్నై మీదుగా హైద్రాబాద్ వచ్చింది. బ్యాంకాక్ లోని వ్యభిచార నిర్వాహకురాలి సూచనలతో నాయక్ అనే వ్యక్తి నడిపించే బ్రోతల్ హౌస్ లో వ్యభిచారం ప్రారంభించారు. బంగ్లాదేశ్ నుంచి యువతిని తెచ్చిన ఏజెంట్.. థాయ్ లాండ్ మహిళ, బ్రోతల్ హౌస్ నిర్వాహకుల మీద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసారు.

## మిస్ వరల్డ్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్ష

**జయభేరి, హైదరాబాద్:**



మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నిర్మాతగా నా లక్ష్యమదే!



అగ్ర కథానాయిక సమంత నిర్మాతగా మారిన విషయం తెలిసిందే. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. హర్షిత్ రెడ్డి, శ్రియా, శ్రావణి, షాలినీ, చరణ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఆదివారం విశాఖపట్నంలో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ 'నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ కొత్త కథల్ని పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ బ్యానర్‌ను స్థాపించాను. వైజాగ్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ చేసిన ప్రతీ సినిమా హిట్ అయింది. వైజాగ్ అభిమానుల్ని చూసి నిజమైన ప్రేమ ఏంటో అర్థమైంది' అని చెప్పింది. తెలుగులో ఇప్పటివరకు ఇలాంటి హారర్ కామెడీ కథ రాలేదని, సమంత వల్లే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చిందని దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల తెలిపారు. బుల్లితెరలో వచ్చే సీరియల్స్‌ని అందరూ తక్కువ చేసి మాట్లాడుతుంటారని, కానీ వాటిపై తనకు చాలా గౌరవం ఉందని, అదే పాయింట్‌ను ఈ సినిమాలో హారర్ ఫార్మెట్‌లో చూపించామని రచయిత వసంత్ మరిగంటి పేర్కొన్నారు. వినూత్న కథా చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉందని చిత్ర తారాగణం ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: క్లింటన్ సెరెజో.



# రామ్ చరణ్ మైనపు విగ్రహ ఆవిష్కరణ.. లండన్‌లో ప్రత్యక్షమైన చిరు ఫ్యామిలీ

చిరంజీవి తనయుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రామ్ చరణ్ తనదైన టాలెంట్‌తో పాన్ ఇండియా స్థాయికి ఎదిగాడు. రంగస్థలం, ఆర్ఆర్ఆర్ చిత్రాలలో రామ్ చరణ్ నటన చూసి పరవశించని వారు లేరు. ఇప్పుడు పెద్ది అనే సినిమాతో ప్రేక్షకులని పలకరించబోతున్నాడు. ఈ చిత్రం బుచ్చి బాబు దర్శకత్వంలో తెరకెక్కుతుంది. ఇందులో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనున్నాడు. ఈ చిత్రంతో చెర్రీ మరోసారి తన టాలెంట్ ప్రదర్శించడం ఖాయం అంటున్నారు. అయితే గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన రామ్ చరణ్‌కి అరుదైన గౌరవం దక్కింది. ఆయన మైనపు విగ్రహం లండన్‌లోని మేడం టుస్సాడ్స్ మ్యూజియంలో మే 9న ఆవిష్కరించనున్నారు. రామ్‌చరణ్‌కు దక్కిన ఈ గౌరవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు మెగా ఫ్యామిలీ అంతా లండన్‌లో వాలారు. మెగాస్టార్ చిరంజీవితో పాటు ఆయన భార్య సురేఖ, రామ్ చరణ్ ఉపాసన దంపతులు, కుమార్తె క్లీన్ కారా, పెంపుడు శునకం రైమ్ లండన్‌లో ప్రత్యక్షం అయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రముఖుల మైనపు విగ్రహాలని లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఉంచుతారన్న విషయం మనందరికి తెలిసిందే. ఇప్పుడు ఈ ప్రతిష్ఠాత్మక మ్యూజియంలో టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మైనపు విగ్రహం కూడా కొలువుదీరనుండడంతో ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేవు. మే 11న లండన్‌లోని ప్రఖ్యాత రాయల్ ఆల్బర్ట్ హాల్ లో RRR సినిమాని ప్రదర్శించనున్నారు. అక్కడ కీరవాణితో RRR సాంగ్స్ ఆర్కెస్ట్రా నిర్వహించి, రాజమౌళి, రామ్ చరణ్, ఎన్టీఆర్ లతో క్వశ్చన్ - ఆన్సర్స్ కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్టు తెలుస్తుంది. అంటే దాదాపు వారంకి పైగా మెగా ఫ్యామిలీ అంతా లండన్‌లో ఉండనున్నట్టు తెలుస్తుంది. తిరిగి వచ్చాక రామ్ చరణ్ పెద్ది సినిమా షూటింగ్‌లో పాల్గొననున్నాడు. ఇప్పటికే పెద్ది గ్లింప్స్ విడుదల కాగా, ఇది ఎంత సెన్సేషన్ క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా రామ్ చరణ్ క్రికెట్ షాట్ అయితే తెగ వైరల్ అయింది.



# ఆహా.. ఏం అందం గురూ..!

ఫారియా అబ్దుల్లా 1998 మే 28న హైదరాబాద్, తెలంగాణ, భారతదేశంలో జన్మించింది. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టిన ఈ బ్యూటీ హీరోయిన్ గా రాణిస్తుంది. హిందీఉర్దూ మాట్లాడే ముస్లిం కుటుంబానికి చెందినది. ఆమె తండ్రి సంజయ్ అబ్దుల్లా ఒక వ్యాపారవేత్త, తల్లి కౌసర్ సుల్తానా గృహిణి. ఆమెకు ఇనాయ అబ్దుల్లా అనే సోదరి ఉంది. హైదరాబాద్‌లోని మెరిడియన్ స్కూల్ మరియు భవన్స్ అట్మకూరి రామారావు స్కూల్‌లో చదువుకుంది. ఆమె లొయోలా అకాడమీ డిగ్రీ, పీజీ కాలేజీ నుండి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పూర్తి చేసింది. ఫారియా చిన్నతనం నుండే డాన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉంది. ఆమె హైదరాబాద్‌లో శియామక్ దావర్ నృత్య తరగతులలో చేరింది. కథక్, స్ట్రీట్ హిప్‌హాప్, హౌస్, వాకింగ్, బెల్లీ డాన్స్ వంటి వివిధ నృత్య రూపాలలో శిక్షణ పొందింది. ఫారియా హైదరాబాద్‌లో సమహారా వీకెండ్ థియేటర్ వర్క్‌షాప్, కిస్సాగో థియేటర్ అండ్ ఫిల్మ్ ప్రొడక్షన్స్, నిషుంబిత బ్యాలెట్ అండ్ థియేటర్ గ్రూప్ వంటి ప్రముఖ థియేటర్ గ్రూప్‌లతో కలిసి 50కి పైగా తెలుగు భాషా రంగస్థల ప్రదర్శనలలో పాల్గొంది. ఫారియా 2021లో "జాతిరత్నాలు" అనే తెలుగు కామెడీ చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసింది, ఇందులో ఆమె నవీన్ పోలిశెట్టితో కలిసి నటించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్ అయింది. ఈ పాత్ర కోసం ఆమె SIIMA అవార్డు కోసం ఉత్తమ తొలి నటి (తెలుగు)గా నామినేట్ అయింది. ఆమె ఈ చిత్రం కోసం రెండేళ్లపాటు తెలుగు నేర్చుకుని, స్వయంగా డబ్బింగ్ చేసింది.



# 12 ఏళ్లకే ట్రెండ్ సెట్టర్.. హీరోయిన్లను మించి ఫాలోయింగ్..

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు గారాల పట్టి సితార. మొదట ప్రిన్స్ మహేష్ బాబు ఫేమ్‌తో గుర్తింపు దక్కినా.. ఆ తర్వాత తన టాలెంట్‌తో సపరేట్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. శాస్త్రీయ నృత్యం నేర్చుకున్న సితార.. డ్యాన్స్ వీడియోలతో సోషల్ మీడియాలో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. గతంలో సినీ సెలబ్రిటీలను కూడా ఇంటర్వ్యూ చేసింది. అంతేకాదు ఓ ప్రముఖ జ్యూయెలరీ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ ఓ హీరోయిన్ అందకునేంత రెమ్యునరేషన్ తీసుకుంది. సితార ఇప్పటి వరకు సినిమాల్లో నటించలేదు. కేవలం యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇంత ఫేమ్ సంపాదించుకుంది. అయితే సితార తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం వెనుక ఆమె తల్లి నమ్రతా కృషి చాలా ఉంది. డ్యాన్స్,యాక్టింగ్, హావభావాలు పలికించడంలో రాటుదేలేలా ట్రైనింగ్ ఇప్పించింది. ఇలా చిన్నప్పటి నుంచే సితారపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో చిన్న వయసులోనే స్టార్‌గా గుర్తింపు తెచ్చుకుంది.



# ఓటీటీలోకి సిద్ధు జొన్నలగడ్డ జాక్ మూవీ..

యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ నటించిన తాజా చిత్రం 'జాక్'. కొంచెం క్రాక్ అనేది ట్యాగ్‌లైన్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గతనెల 10వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే, ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. మే 8వ తేదీన ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఇది ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ నెట్‌ఫ్లిక్స్ ఇండియా సౌత్ ఎక్స్ ఖాతాలో తాజాగా పోస్ట్ పెట్టింది.

డీజే టిల్లుతో యూత్‌తోపాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. ఆ తర్వాత టిల్లు స్క్వేర్ మూవీతో మరో హిట్ అందుకున్నాడు. ఈ రెండు సినిమాల తర్వాత సిద్ధు జొన్నలగడ్డ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం జాక్. బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్ట్ చేశాడు. బేబి సినిమాతో అదిరిపోయే క్రేజ్ సంపాదించిన వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటించింది.

జాక్ అలియాస్ పాబ్లో నెరోడా (సిద్దు జొన్నలగడ్డ) చాలా తెలివైన కుర్రాడు. చిన్నప్పటి నుంచి ఏవోవో కావాలని కలలు కంటుంటాడు. కానీ ఏది కూడా రూల్ ప్రకారం చేయడు. తనకంటూ ఒక సేఫరేట్ స్టయిల్ పెట్టుకుంటాడు. తనకి సాధారణమైన పని చేయడం ఇష్టం వుండదు. 'రా' ఏజెంట్ కావాలని అనుకుంటాడు. ఇంటర్వ్యూకి వెళ్తాడు. అయితే జాబ్ వచ్చేలోపే దేశాన్ని కాపాడే ఓ మిషన్ లో భాగంగా ఉగ్రవాదులు వెంటపడతాడు. తీవ్రవాదిని వెదుక్కుంటూ నేపాల్ వెళ్తాడు. తర్వాత ఏం జరిగింది? ఈ కథలో మనోజ్ (ప్రకాష్ రాజ్), రెహ్మాన్ (రాహుల్ దేవ్), ఆఫ్షాన్ బేగం (వైష్ణవి చైతన్య) ఎవరు? చివరి జాక్ మిషన్ సక్సెస్ అయ్యిందా లేదా? అనేది మిగతా కథ.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com